# ఐక్యత



ఆఫీసు నుంచి ఇంటికి రాగానే వాలుకుర్చీలో కూర్చున్నాడు రాజారావు.

ఆరోజు అతనికి చాలా ఆనందంగా ఉంది. 'తన చిరకాల వాంఛ త్వరలో నెరవేరబోతోంది. తమ ఆఫీసులో యూనియన్ సెక్రెటరీ శ్రీధరరావును పదవి నుంచి దింపేయాలని చాలారోజుల నుంచీ ప్రయత్నిస్తున్నాడు. ఒక్కొక్కరినీ మెల్లగా తనవైపు త్రిప్పుకుంటున్నాడు.

మరుసటిరోజు జరిగే రహస్య సమావేశంలో ఇరవై మంది వస్తే చాలు- తాను ధైర్యంగా ఎన్నికలు జరుపమని అడగవచ్చు. ఈసారి తాను సెక్రటరీ అయితే ఆ శ్రీధరరావును ముప్పుతిప్పలు పెట్టడం ఖాయం! వాడు ట్రాన్స్‌ఫర్ చేయించుకొని పారిపోవడం ఖాయం!!

రాజారావు కుర్చీలోంచి లేచి కాళ్లూచేతులు కడుక్కునేందుకు పెరటివైపు నడిచాడు. బాత్‌రూమ్ వైపు పోబోతూ, లోనుంచి మాటలు వినిపించి నిలబడిపోయాడు.

"ఏమండీ! ఎందుకు మీరిలా గుర్తింపులేని ఖర్చులన్నీ చేస్తారు? మీ అన్నలా మీరూ నెలకింత అని యింటికి యిస్తున్నారు కదా! మళ్లీ యిలా కూరగాయలు, నెయ్యి, మందులు అంటూ ఖర్చులు చేస్తూ పోతే చివరికి మన పిల్లలకేం మిగలదు. మీరు కాస్త బ్రతకడం నేర్చుకోండి!"

"అలాగే లేవే! ఇకపై నెల మొదట్లో యిచ్చే డబ్బు యిచ్చేసి, ఆపై యింటికై నయాపైసా ఖర్చు చేయను. సరేనా!"

తన రెండవ కొడుకు, కోడలు మాట్లాడుకునే మాటలు యిక వినలేక, భార్యను కాఫీ అడుగుదామని వంటగది వైపు నడిచాడు.

అక్కడ తన మూడవ కొడుకు తన తల్లితో మాట్లాడుతున్నాడు-

"అమ్మా! ఇక అన్ని పనులూ చేయడం నావల్ల కాదు. వాళ్ళిద్దరిలా నాకు ఉద్యోగం లేనంతమాత్రాన నన్నే పనిమనిషిని చేసి యింటిచాకిరీ అంతా చేయించడం న్యాయం కాదు. నేనూ పరీక్షలకు చదువుకోవాలి. ఇకపై యింటిపని ముగ్గురూ సమానంగా పంచుకోవాలి. ఒకరోజు నేను కూరగాయలు తెస్తే- యింకో రోజు యింకొకరు తేవాలి. ఒక నెల నేను కరెంట్ బిల్ కడ్తే- యింకో నెల యింకొకరు కట్టాలి."

మనస్సు చివుక్కుమంది రాజారావుకి. దిగాలుగా మేడ మెట్లు ఎక్కసాగాడు. ఇంతలో... అక్కడా మాటలు వినిపించి ఆగిపోయాడు-

"అయినా మీ తండ్రికి లేని బాధ్యతలు మీకెందుకండీ? ఎవరెటు పోతే మీకేం? నా మాట విని, నెలకింత అని యివ్వడం తప్ప యింకే విషయంలోనూ మీరు తలదూర్చకండి!"

తన పెద్దకోడలు తన కొడుకుకు చేస్తున్న హితబోధ విని, తిరిగి క్రిందకు వచ్చి తన కుర్చీలో కూర్చున్నాడు రాజారావు. కళ్ళు మూసుకుని ఆలోచనలో మునిగిపోయాడు...

తను తన ఆఫీసులో అందరూ ఐకమత్యంగా ఉండటం యిష్టంలేక తన స్వార్థం కోసం, శ్రీధరరావును దింపడం కోసం ఆఫీసుని రెండుగా చీల్చాడు. కానీ, తన యింట్లోనే రాజకీయాలు నడుస్తున్నాయి. ఏ ఇల్లు ఆదర్శవంతంగా ఉండాలనుకున్నాడో ఆ ఇల్లే ఇప్పుడు ముక్కలుగా చీలబోతోంది.

రాజారావులో పశ్చాత్తాపం మొదలైంది...

'అవును... ముందు తను తన యింట్లోని మనుషుల మనసులకు మరమ్మత్తు చేయాలి. ఆపై శ్రీధరరావుకు దగ్గరై ఆఫీసులో పడిపోతున్న ఐక్యతను మళ్లీ నిలబెట్టాలి."

ఇప్పుడు రాజారావు మనసు ప్రశాంతంగా ఉంది.

●

'మయూరి' వారపత్రిక ... 6 మార్చి' 1992